
**నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 53**




# నేటి అనుభవాలే రేపటి జ్ఞాపకాలు! ఎల్లుండికవే కథలు!!

**- వంశీ**

వంశీ గారి పేరు వినగానే మనకు దర్శకుడు గుర్తుకు వస్తాడు. అయితే ఆయనలో అద్భుతమైన కథకుడు కూడా దాగి ఉన్నాడు. సుందర కావ్యాలనదగ్గ చిత్రాలకు దర్శకత్వం వహించినట్టే ఎన్నో అపురూపమైన కథలను తెలుగు పాఠకులకు అందించారాయన. గోదావరి పరీవాహక ప్రాంతాన్నీ, అ ప్రాంతంలోని మనుషుల జీవితాలను, అక్కడి చెట్టూ చేమలను అన్నింటినీ కథా వస్తువులుగా మలచడం వంశీగారికే తెలుసు. కెమెరా లెన్స్‌కు అందని ఎన్నో అపురూపమైన దృశ్యాలను అక్షరాలుగా ఆవిష్కరిస్తున్నారాయన. రంపచోడవరం మొదలు పాపికొండల దాకా ఉన్న జనజీవితాన్ని కథలుగా మలచడంలో 'పేటెంట్' కలిగి ఉన్న వంశీగారితో ఇంటర్వ్యూ ఈవారం..

వంశీగారిని కలవడం కోసం నవ్య వీక్లీ ఎడిటర్ ఎ.ఎన్.జగన్నాథశర్మ గారి వెంట ఫిలిమ్ నగర్ వెళ్లాను. అక్కడ తమ కార్యాలయంలో వంశీ గారిని కలిశాం. తను తీయబోయే కొత్త సినిమాకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జగన్నాథశర్మ గారిని చూడగానే వంశీగారు ఆలింగనం చేసుకున్నారు. వారిద్దరూ బాల్యమిత్రులు. వారు ఆనాటి స్మృతుల్లో కాసేపు మునిగిపోయారు. ఆ స్మృతులను నెమరు వేసుకుంటూనే వంశీగారు తన గురించి, తన బాల్యం గురించి, తన కథల గురించి చెప్పుకొచ్చారు.



## రైళ్లను చూస్తూ కూర్చునేవాణ్ణి

మాది రామచంద్రాపురం. మా అమ్మ సూరాయమ్మ, నాన్న సుబ్బారెడ్డి. మేం ముగ్గురం సంతానం. నేను, తమ్ముడు, అక్క. నేను 20 నవంబర్ 1956లో పుట్టానని మా అక్క చెప్పింది. నాన్న షుగర్ ఫ్యాక్టరీలో పని చేసేవారు. నా బాల్యం అందరి పిల్లల్లాగే ఆటపాటలతో గడిచింది. సెలవులు దొరికాయంటే చాలు, బలభద్రపురంలోని అమ్మమ్మ గారింటికి వెళ్ళిపోయే వాడిని. అక్కడ వచ్చిపోయే రైళ్లను చూస్తూ కూర్చునే వాణ్ణి. అలా రైలును చూడ్డం ఆ వయసులో ఏదో అద్భుతంగా ఉండేది. అది నా మనసులో ఓ మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. అందుకే, ఇప్పటికీ నా సినిమాల్లో ఎక్కువగా రైళ్ళు కనిపిస్తుంటాయి.

## కథకు పాతిక రూపాయలిచ్చారు

నాకు చిన్నప్పటినుంచీ సాహిత్యం అంటే చాలా పిచ్చి. పాఠ్య పుస్తకాలకన్నా కథలూ, నవలలే ఎక్కువగా చదువుకున్నా. రామచంద్రాపురంలో 'తోటవారి లైబ్రరీ' ఉండేది. అందులో పుస్తకాలన్నీ చదివేశాను. ముఖ్యంగా సంస్కృత కావ్యాలు బాగా చదువుకున్నా. అలా పుస్తకాలు చదవడంతో నాకూ రాయాలనే కోరిక పుట్టింది. అయితే కావ్యాలు చదివినప్పటికీ నాకు పద్యరచన పైకి మనసు పోలేదు. కథా రచనే నన్నెక్కువగా ఆకర్షించింది. 1974లో 'సత్యసుందరి నవ్వింది' అనే కథ రాశాను. అదే నా మొదటి కథ. ఇది విజయవాడ నుంచి ఆలిండియా రేడియోలో 'యువవాణి' కార్యక్రమంలో ప్రసారం అయింది. మా ఊరినుంచి విజయవాడకు బస్సులో వెళ్ళి కథ చదివి వచ్చాను. అప్పట్లో కథకు పాతిక రూపాయలిచ్చారు. ఇది చాలా పెద్ద మొత్తమే!

### నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | జిజుమొర (గొల్లపూడి మారుతీరావు) |
| కథకుడు | : | ముళ్ళపూడి వెంకటరమణ |
| కవయిత్రి | : | రేవతీదేవి |
| నవల | : | మునెమ్మ |
| నాటకం | : | తాజీ (డీన్‌బద్రు) |
| చిత్రకారుడు | : | బాపు |
| కావ్యం | : | ఆముక్త మాల్యద |

## ఒంటరిగా ఉండేవాడిని

నేను చిన్నప్పటినుంచీ ఒంటరివాడిని. ఎందుకో ఇతర పిల్లల్లా అందరితో కలసిపోయేవాడిని కాదు. పుస్తకాలు చదువుకుంటూ, ఒంటరిగా ఉండేవాడిని. మా ఊరిలో నాకు బాల్యంలో మిత్రులు కూడా చాలా తక్కువే! అయితే బాల్యంలో నాకో మిత్రుడు ఉండేవాడు. కారణమేంటో తెలియదు కానీ, అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఎవ్వరూ నాకు స్నేహితులు ఏర్పడలేదు. ఎప్పుడు చూసినా చదవడం, చదవడం.. ఇదే పని. ఇలా చదవడం నుంచే రాయడం మొదలయింది.

## మొదటి కథకు బహుమతి వచ్చింది

1975లో ఆంధ్రజ్యోతిలో నా మొదటి కథ అచ్చయింది. ఆ కథ పేరు 'దేవుడా రక్షించు నాదేశాన్ని'. ఈ కథకు అప్పట్లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన కథల పోటీలో తృతీయ బహుమతి వచ్చింది. ఆ తర్వాత వరుసగా కథలు రాశాను. దాదాపు 50కి పైగా కథలు రాశాను. ఇటీవల పసలపూడి కథలు పుస్తకంగా వచ్చింది. మా దిగువ గోదావరి కథలు ప్రస్తుతం రాస్తున్నాను. 'మంచుపల్లకి' అనే నవల కూడా రాశాను.



## రైలు ప్రయాణాల్లో ఎక్కువ ఆలోచనలు వస్తుంటాయి

నాకు కథలు రాయడానికి ప్రత్యేకమయిన సమయమంటూ ఏమీ ఉండదు. కానీ రైలు ప్రయాణాల్లో ఎక్కువ ఆలోచనలు వస్తుంటాయి. నేను ఆ రోజుల్లో ఎక్కువగా వైజాగ్ నుంచి వాల్తేరు మీదుగా కిరండోల్‌కు రైల్లో వెళ్ళే వాడిని. కొండలు తవ్వి టన్నెల్ ఏర్పాటు చేశారు. అందులోంచి వెళుతుంది రైలు. ఆ జర్నీలో ఓసారి అద్భుతమయిన కథ రాశాను. ఇప్పటికీ తరచూ అరకు వెళ్తుంటాను. అలా వెళ్ళినప్పుడల్లా ఓ కథ రాస్తుంటాను. అరకు ప్రాంతంలోని ఆ స్వచ్ఛమైన గాలి, ఆ పచ్చదనం, ఆ చల్లదనం కథలు రాసేలా చేస్తాయనుకుంటా. పసలపూడి కథలకు ముందు నావి ఎక్కువ కథలేం లేవు. కేవలం యాభై కథలుంటాయంతే! నేను పుంఖానుపుంఖాలుగా రాసే రచయితను కాను.

## ఆ చుట్టుపక్కల నాకు తెలియని పల్లె లేదు

గోదావరి పైన ఎక్కువగా ప్రయాణించడం, గోదావరి ప్రాంతంలో జీవించడం నా అదృష్టం! అందుకే గోదావరిపైన ట్రావెలాగ్స్ సైతం రాశాను. గోదావరి పరీవాహక ప్రాంతంలో రంపచోడవరం, రామన్నపేట, పాపికొండల మొదలు ఆ చుట్టుపక్కల నాకు తెలియని పల్లెలు లేవు. నేను చూడని చెట్టు లేదు. నేను తిరగని కొండ లేదు. ఆ ప్రాంతం వాడిని కావడంతో గోదావరిపై ఎక్కువ కథలు రాసే అదృష్టం నాకు కలిగింది. దిగువ గోదావరిపై దాదాపు 150 కథలు రాసి ఉంటాను. ఒక్కోసారి కొన్ని అందాలు మనకంటికి కనిపిస్తాయి. హృదయానికి తెలుస్తాయి. అయితే వాటిని కెమెరా పట్టుకోలేదు. అలా కెమెరా పట్టుకోలేని అందాలు గోదావరి ప్రాంతంలో చాలా ఉన్నాయి. అలా అని వాటిని అలానే వదిలేయలేం కదా. అందుకే లెన్స్‌కు దొరకని విషయాలను కథలుగా రాశాను. రాస్తున్నాను. విజువల్ మీడియాలో డైరెక్టర్‌గా ఉండి కథలు రాసే వారు చాలా అరుదు. వారిలో నేనొకణ్ణేమో!

## రచయితలకు వేషాలిచ్చాను

వంశీ అంటే ప్రజలకు కథకుడిగా కన్నా డైరెక్టర్‌గానే బాగా తెలుసు. నాకు మాత్రం ఇప్పటికీ కథలంటేనే అభిమానం. కథా రచయితలన్నా అభిమానం. ఆ అభిమానంతోనే నా సినిమాల్లో రచయితలకు చిన్న చిన్న వేషాలు ఇచ్చాను. చిత్రకారుడు కథకుడు చంద్ర, రాజారామమోహనరావు లాంటి రచయితలు చాలామంది నా సినిమాల్లో వేషాలు వేసారు.

## జ్వాల

కంతు(ఎ.ఎస్.జగన్నాథశర్మ) నాకు బాల్యమిత్రుడు. ఇద్దరం కథా రచయితలమే! కాకపోతే అప్పటికింకా మా కథలు అచ్చుకాలేదు. అయినా ఇద్దరం కథల గురించి ఎక్కువగా చర్చించుకునే వాళ్ళం. కీర్తిశేషులు ప్రముఖ రచయిత, యువ సంపాదకుడు అయిన రామవరపు వేణుగోపాలరావు చేతిరాతతో కంతు సంపాదకత్వంలో 'జ్వాల' లిఖిత మాసపత్రిక వెలువడేది. ఆ పత్రికను చదవడం కోసం నేను ప్రతి నెలా రామచంద్రాపురం నుంచి కంతూ వాళ్ళ ఊరు పార్వతీపురం వెళ్ళేవాడిని. ఆ పత్రికకు ఇప్పటి ప్రముఖ రచయితలు పంతులజోగారావు, పి.వి.బి.శ్రీరామమూర్తి, వోలేటి శ్రీనివాసభాను సహాయకులుగా ఉండేవారు. చాలా మంది పెద్దవాళ్ళు ఆ పత్రికకు కథలు పంపేవారు. నేను కూడా ఆ పత్రికకు రచనలు పంపాను.

## నా లైబ్రరీలో కథల పుస్తకాలే ఎక్కువ

మామూలుగా కథా రచయితలకు గురువులు ఉంటారు. లేదా కథారచన వైపు ప్రోత్సహించిన వారుంటారు. నాకు అలాంటి వారు ఎవరూ లేరు. పుస్తకాలు విపరీతంగా చదవడం, జీవితాన్ని చూడ్డమే నన్ను కథారచయితను చేశాయి. నేను సినిమా రంగంలో ఉన్నప్పటికీ నా మటుకు నాకు కథే క్లిష్టమయింది అనిపిస్తుంది. అందుకే నాకు కథలంటే ఇష్టం. ఇవ్వాళ మన అనుభవాలే రేపటి జ్ఞాపకాలుగా మారుతాయి. ఆ జ్ఞాపకాలే కథలు. ఎవరి కథలయినా చాలామటుకు జ్ఞాపకాలే కదా! నా లైబ్రరీలో కూడా కథల పుస్తకాలే ఎక్కువగా ఉన్నాయి.

## ఏ కథా రాత్రికి రాత్రే పుట్టుకు రాదు

ఇప్పటి కథలు చాలా బాగుంటున్నాయి. కన్నీళ్లు తెప్పించే కథలు చాలా చదివాను. గంధం యాజ్ఞవల్క్య శర్మగారి 'సెలవయింది' చాలా మంచి కథ. దీనిని నేను ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం చదివాను. ఇప్పటికీ నన్నా కథ వెంటాడుతూనే ఉంది. ఇలాంటి కథ రాయడం వెనక రచయిత బాగా సంఘర్షణకు లోనై ఉంటాడు. ఏ కథా రాత్రికి రాత్రే పుట్టుకురాదు. నేను 'మన్యం రాణి' నవల రాయడానికి ముందు, ఆ ప్రాంతానికి వెళ్ళాను. అక్కడే కొన్ని రోజులున్నాను. అక్కడి పక్షులు, వనమూలికలు.. ఇలా అనేక విషయాలను దగ్గరుండి పరిశీలించి, వివరాలు సేకరించి నవల రాశాను. ఓ రచన బాగా రావాలంటే దాని వెనక ఇంత కష్టం ఉంటుంది మరి.

**-సుంకోజి దేవేంద్రాచారి**



రైళ్ళన్నా, రైల్వే స్టేషన్నన్నా, అక్కడి ప్లాట్‌ఫామ్, సిమెంట్ బెంచీలు, తురాయి చెట్లన్నా వంశీతో పాటు నాకూ ఇష్టమే! అందుకే మా పార్వతీపురానికి వంశీ వచ్చినప్పుడల్లా ఇద్దరం టౌన్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం మీద, తురాయి

## ఆ రోజులు ఏమయిపోయాయి నేస్తం!

చెట్టునానుకుని ఉన్న సిమెంట్ బెంచీ మీద గంటలకు గంటలు కూర్చుని కబుర్లాడుకునే వాళ్ళం. తిలక్ కథ 'ఊరి చివరి ఇల్లు' అంటే వంశీకి ఇష్టం. ఆ కథ నాకూ ఇష్టమే! అల్లం శేషగిరి రావుగారి 'వరదు' అంటే వంశీకి ఇష్టం. ఆ కథ కూడా నాకిష్టం. జయంతి వెంకటరమణ 'వంతెన' అంటే వంశీకి ఇష్టం. నాకూ ఆ కథ అంటే చెప్పలేనంత ఇష్టం. ఇలా ఇష్టాలు కలవడంతోనే మేమిద్దరం ఫ్రెండ్సయ్యాం. అప్పటికింకా మా కథలు అచ్చు కాలేదు. కావాలని తహతహలాడే వాళ్ళం. 'ఒక్క కథ! ఒక్కటంటే ఒక్కటి అచ్చయితే బాగుణ్ణు' అనుకుని ఎన్ని రాత్రులు పత్రికల గురించీ, ఆ పత్రికల సంపాదకుల గురించి మాట్లాడుకున్నామో లెక్కలేదు. మాట్లాడుకుంటుంటే ఆకలి వేసేది. టైం చూస్తే తెల్లారుజాము మూడున్నర-నాలుగ్గంటలయ్యేది. 'ఇలాంటప్పుడురా!వేడి వేడిగా ఇడ్లీలు తినాలి' అనేవాడు వంశీ. 'అయితే పద' అంటూ ఇద్దరం కలిసి వేణుగోపాల్ టాకీసు దగ్గరి 'చలమయ్య హోటల్' కి చేరుకునే వాళ్ళం. వేడి వేడి ఇడ్లీలు రెండు మూడు ప్లేట్లు లాగించే వాళ్ళం. బిల్ వంశీనే చెల్లించేవాడు. మా ఊరొచ్చి నువ్వేంటి బిల్లిచ్చేది' అంటే 'ఈసారికి ఇలా కానీ' అనేవాడు. టాకీసు దగ్గరి సినిమా పోస్టర్లు చూసి-

'ఎప్పటికయినా సినిమా డైరెక్టర్స్ కావాలి' అంటే 'కథ అచ్చుకాని కంతుగాడు సినిమా డైరెక్టర్' అంటూ నవ్వేవాడు. వర్షం వస్తే పరిగెత్తే వాళ్ళం కాదు, నింపాదిగా నడుచుకుంటూ ఇంటికి చేరుకునే వాళ్ళం. వదినమ్మ పెట్టిన తాలింపు రొట్టె తిని మళ్ళీ ప్లాట్‌ఫాం మీదికి చేరుకునే వాళ్ళం. సిమెంట్ బెంచీ మీద కూర్చుంటే మళ్ళీ చినుకులు. చెట్ల కొమ్మల్లో దాగిన రహస్యపు వాన కురిసేది. ఆ వానలో తడుస్తూ వచ్చీ పోయే రైళ్ళను చూసే వాళ్ళం. ఆ రోజులే వేరు. వాన కురిస్తే, ఆకాశంలో హరివిల్లు విరిస్తే తమ కోసమే అన్నట్టుగా ఆనందించే పిల్లల్లా నేనూ వంశీ ఉండేవాళ్ళం. పెద్దవాళ్ళం అయ్యాం. ఇప్పుడు వాన కురిసినా చలి వేసినా వెన్నెల కాసినా ఆ అనుభూతులు లేవు. ఎందుకనో!?

**-కంతు**

నాకు నచ్చిన నా కథ

# నల్లసుశీల

- వంశీ

భూషణం పెట్రోమాక్స్ లైటు పట్టుకుని నడుస్తున్నాడు అడవిలో. వెనకాలే వెళుతోంది నల్ల సుశీల.

చీకటి చిక్కగా అలుముకుపోయి వుంది.

సుళ్ళు తిరుగుతూ వీస్తోంది కొండగాలి

చుక్కలతో నిండిపోయి వుంది ఆకాశం.

నడుస్తున్న సుశీల కాళ్ల మధ్యలోంచి నాగుపాము ఒకటి జరజరా పాక్కుంటూ వెళ్ళేసరికి టక్కున ఆగిపోయింది. ముందెళుతున్న భూషణం వెనక్కి తిరిగి – ''ఆగిపోయావేం. రా!'' అన్నాడు.



"పద!" నడవడం మొదలెట్టింది.

"ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఆ దొరగారు మనకోసం చూస్తూ వుంటాడు. ఆయనగారికి కోపం చాలా ఎక్కువట" గొణుక్కున్నాడు భూషణం.

నలభై రెండో నంబరు టన్నెల్ దగ్గర ఎఱ్ఱదీపం ఆరగానే పచ్చదీపం వెలిగింది. గూడ్సు శిమిలిగూడా స్టేషన్ వదిలేసినట్టుంది.

కొంతదూరం నడిచారు. రైలు పట్టాలు దాటుతున్నప్పుడు కుడి కాలి బొటన వేలుకి కలకర్రాయి గట్టిగా తగిలేసరికి "అమ్మా!" అని ముందుకి వంగింది. సరిగ్గా అప్పుడే ఆమె మెళ్ళో ఉన్న పెద్దపెద్ద మంగళసూత్రాలు కిందికి వేలాడి ఊగాయి.

ఆగిన భూషణం– "మళ్ళీ ఏమైంది?" అన్నాడు.

"గొప్పు తగిలింది!"

వెనక్కొచ్చి పెట్రోమాక్సు లైటుకింద పెట్టేసరికి దాని కాంతిలో కనిపించింది చిట్లికారుతున్న రక్తం.

"అయ్యయ్యో! చాలా పెద్దదెబ్బ...! తొందరగా పద! ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాక ఏదన్నా మందు అడుగుదాం" అన్నాడు.

కుంటుతూ అతని కూడా నడుస్తున్న సుశీల ఇప్పుడు బాగా పొడైపోయింది కానీ చాలా అందగత్తె. ఒకప్పుడు సన్నగా, పొడుగ్గా నీలం రంగులో వుండేది. చూపుడు వేలంత సన్నటిముక్కు. దానిచివర మెరిసే ఎఱ్ఱరంగు ముక్కుపుడక కాళ్ళకి మువ్వల పట్టాలు పెట్టుకుంది. నడుస్తుంటే లయనిబట్టి గాలికొండపురంలో ఎవరన్నా సరే– "ఆ వెళ్ళే మనిషి నల్ల సుశీల కదూ?" అనేవారు.


బొమ్మ: బాపు

వాళ్ళమ్మ చినముత్యానికి సుశీలంటే ప్రాణం. తన కాలికిలా దెబ్బ తగిలిందని తెలిస్తే ఈ భూషణం గాడి ప్రాణాలు తీసేస్తది. చిన్నప్పట్నుంచీ ముద్దుగా పెంచుకుంది. అరికాళ్ళ కింద పావుకోళ్ళలాగ సుశీలని అంటిపెట్టుకునే వుంది. నల్ల సుశీలకి సపోటా పళ్ళంటే మహా ఇష్టం. వాటిని ఒలిచి పాలల్లో వేసి పెడుతుంది. విమానపసందు మామిడి పళ్ళు ఇష్టంగా తింటుందని సంతలోకెళ్ళి మేలైన పళ్ళని తనే ఏరి తెస్తుంది. జీడిపప్పులో పంచదార కలిపి పెడుతుంది. పొద్దుటే గేదె పొదుగుల దగ్గర తనే కూర్చుని పితికిన పాలు పరగడుపునే ఇస్తుంది. సుశీల కట్టని, పట్టుబట్టగానీ, వాడని మేలురకం అత్తరుగానీ లేవు.

***

శీతాకాలం... శోభనం గది పువ్వులతో అలంకరించి వుంది. కట్ట అగరొత్తులూ ఒకేసారి వెలిగించెయ్యడంతో ఎటు చూసినా పొగ, ఎవరో పరుపు మీద పిఠాపురం సెంటుబుడ్డి ఒలకబోసేశారు. దాని సువాసనతో గదంతా నిండిపోయింది.

పందిరి పట్టిమంచం అంచుమీద కూర్చున్న సుశీలకి ఆయన లోపలికొచ్చాకా ఎలా మసులుకోవాలో వాళ్ళమ్మ చెప్పినవన్నీ గుర్తుకు వస్తున్నాయి.

కాస్సేపయింది.....

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన వల్లూరి మోహనరావు కాళ్ళకి నమస్కారం చేసి లేచింది.

ఆమె అందాన్నే చూస్తూ నిలబడ్డ మోహనరావు "నువ్వు అమృతం తాగావు" అన్నాడు.

"అవును! మీరు పాలు తాగండి" అందించింది గ్లాసు.

"ఇందాకే విస్కీ తాగాను మరి!" అన్నాడు.

తల్లి చెప్పినట్టు అతనికి సర్వవిధాలా సహకరించింది.

ఆరోజు తర్వాతినించీ ప్రతిరాత్రీ ఇంటి ముందాగే అతని బుల్లెట్ బండి శబ్దం కోసం ఎదురు చూసేది. కొన్నాళ్ళు తనతో గడిపిన అతను ఈ మధ్య ఇటుపక్కకి రావడం మానేశాడు. సుశీలమాత్రం అతని బండి శబ్దం కోసం ఎదురుచూస్తూనే వుంది.

నల్ల సుశీలకి ఒక కొత్త కోరిక పుట్టిందిప్పుడు.

తనకో బిడ్డ పుట్టాలి.

వాడు తెల్లగా, బొద్దుగా, ముద్దొచ్చేలా గుండాలి. కాంతులు నిండిన కళ్ళతో కళకళలాడి పోతూ వుండాలి.

అందమైన పేరు పెట్టాలి వాడికి.

అన్నప్రాసన రోజు చుట్టూ ఉన్న వస్తువుల్లో కౌజారునే ముట్టుకోవాలి వాడు.

కొన్నాళ్ళు గడిచింది.

వల్లూరి మోహనరావు బుల్లెట్‌బండి మసీదు సెంటర్‌కి అవతల వీధిలో వుండే రుక్మిణి చెల్లెలి ఇంటిముందు ఆగడం మొదలెట్టిందిప్పుడు. అది తెలిసిన సుశీల ఒక రాత్రి లాంతరుతో బయల్దేరబోతుంటే ఆపేసిన చినముత్యం "ఎక్కడికీ?" అంది.

"ఆయన దగ్గరికి – అడగడానికి..."

"ఏమని అడుగుతావ్?"

"మన ఇంటికి రాకుండా ఈ ఇంట్లో ఏం చేస్తున్నారని?"

"దుర్గమ్మ గుడి వీధిలో రాజ్యం చెల్లెలు నాని తెల్సుకదా!"

"తెలిస్తే?"

"ముందు నాని దగ్గరుండే మనిషి నీ దగ్గరికి రావడం మొదలెట్టాడు.

అప్పుడు ఆ నాని మనింటికి వచ్చి అడగలేదు గదా... ఏ గొడవా పడ్లేదు కదా?''

''అంటే ఇప్పుడేమంటావమ్మా?''

''ఏం లేదు. పెళ్ళి చేసుకున్నవాడికీ, కన్నెరికం చేసుకున్నవాడికీ తేడా చెపుతున్నాను''.

''అప్పుడు నాకు పెళ్ళి ఎందుకు చెయ్యలేదు?''

''నువ్వు పెళ్ళి చేసుకున్నా దానికంటే ఇదే నయం. డబ్బు, దస్కం రెండూ వస్తాయి, లోపలికి పద!''

తల్లి చినముత్యం ఆలోచనల్ని జీర్ణం చేసుకోడానికి కొన్నాళ్ళు పట్టింది తనకి. ఆ తరువాత పేర్నీడి ప్రభాకరం రావడం మొదలెట్టాడు.

నిజమైన మనిషి ప్రభాకరం. మనసంటే ఏందో అతనికి తెల్సు. మనిషిని ప్రేమించడం తెల్సు.

పరిచయమైన మూడో రోజే అన్నవరం వెళదాం అన్నాడు. 'మేం భార్యాభర్తలం' అని గుళ్ళోఅర్చన చేయించాడు. సాయంత్రం ఇద్దరూ కొండదిగి గోపాలపట్నం వేపు నడుస్తున్నారు.

దేవుడి ప్రసాదం తినేసి విస్తరాకు దూరంగా విసిరేస్తూ ''నన్నెవరన్నా ఇంటర్వ్యూ చేస్తే ఒకటి చెప్పాలనుంది!'' అన్నాడు ప్రభాకరం.

''మిమ్మల్నెవరూ చెయ్యరు నాకు చెప్పెయ్యండి!'' అంది సుశీల.

''సరే.... ఈ ప్రపంచంలో నీ కిష్టమైన స్వీటేది? అని అడుగు''.

అడిగింది.

''ఈ ప్రపంచంలో నా కిష్టమైన స్వీటు అన్నవరం సత్యన్నారాయణ మూర్తి ప్రసాదం!''



## నేను తెలుగువారి అమ్మాయినే....

జెనీలియాకి బాలీవుడ్ బోర్ కొట్టినట్లుంది! గత కొంత కాలంగా టాలీవుడ్ వైపు కన్నెత్తి కూడా చూడని జెనీలియాకు ఇప్పుడు తెలుగు వారి మీద ప్రేమ పొంగిపొర్లుతోంది. '' వాస్తవానికి నేను తెలుగు అమ్మాయినే(నిజం కాదనుకోండి) కాకపోతే టైం లేక తెలుగు సినిమాలు చేయలేకపోతున్నాను. అంతే! ఇప్పుడు తెలుగులో రెండు మూడు సినిమాలు చేయబోతున్నాను'' అని జెనీలియా తన అభిమానులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. రామ్‌చరణ్ సరసన ఒక సినిమా కన్‌ఫర్మ్ కాగా మరొక రెండు సినిమాలు చర్చల్లో ఉన్నాయని ఆమె చెబుతోంది.

''నిజమే సుమా!'' అని అతని నడుం చుట్టూ ఎడమచెయ్యి వేసి ముందుకు నడిచింది.

అదంతా మైదానం. ఉన్నట్టుండి ఆగిపోయిన ప్రభాకరం ''నన్ను ముద్దు పెట్టుకో'' అన్నాడు.

''ఎవరన్నా చూస్తే?'' అంది.

వెంటనే ''రక్షించండి! హెల్ప్! హెల్ప్!'' అని అరవడం మొదలుపెట్టాడు. ఎవరూ రాలేదు. ఇక అరుపులాపి, ''ఎవరూ రావట్లేదు. కాబట్టి ఇప్పుడు నన్ను ముద్దు పెట్టుకోవచ్చు!'' అన్నాడు.

నవ్వేసిన సుశీల ''మొన్న చూసిన సినిమాలో సీనిది!'' అని తన గులాబీ రంగు పైట తీసి గుండెల మీద ముద్దు పెట్టించుకుని, అతని పెదాలమీద తనూ ముద్దు పెట్టింది.

అలా అల్లిబిల్లిగా అతనితో అల్లుకుపోయింది సుశీల. రోజులు హాయి హాయిగా గడుస్తున్నాయి. మధురంగా వుంది జీవితం. మొలకగా ఉన్నప్పుడే గిల్లి వేయబడ్డ ఆశ మళ్ళీ మొలకెత్తడం మొదలెట్టింది.

తనకో బిడ్డపుట్టాలి. వాడు ముద్దుగా, బొద్దుగా తన చంకలోంచి నలుగురూ లాగేసుకునేంత అందంగా వుండాలి.

కొన్నాళ్ళు గడిచాక ప్రభాకరం కూడా రావడం మానేశాడు.

ఏమయిందా అని వాకబుచేస్తే తెలిసింది. బావమరుదులు అతన్ని చంపేసి వాళ్ళ పొలాల మధ్య వుండే చింతాలమ్మ గుడిలో పారేశారట.

మూడు నెలల పాటు గదిలోంచి బయటికి రాలేదు నల్లసుశీల.

తర్వాత.

ఏమిటీ జీవితం? అన్న ప్రశ్న.

మళ్ళీ ఎదురుగా తల్లి చినముత్యం.

ఆ తర్వాత తన జీవితంలో చాలామంది..,

కాలం తన ఆయుష్షుని మింగేసింది. రాత్రి జడలో నలిగిన మల్లెపువ్వులా వాడిపోయింది అందం. చాలామంది కన్నెపిల్లలు తయారయ్యారు. కొత్త నీరు వచ్చేసింది. ఎంత అలంకరించుకున్నా వృథా! ఇలాంటి పరిస్థితులొచ్చాక చాలామంది చిన్నచిన్న టౌన్లలో వుండే లాడ్జీలకి, ఆ తర్వాత హైవేల మీదకి మారిపోతుంటారు.

ఏం చేద్దామా అని ఆలోచిస్తుండగా ఎవరో చెప్పారు గాలికొండాపురం వెళ్ళిపొమ్మని.

అక్కడెవరున్నారంటే, 'అదో చిన్న టూరిస్టు ప్లేసు. మీలాంటి వాళ్ళెవరూ వుండరక్కడ.

అక్కడికొచ్చి నాలుగు రోజులుండే టూరిస్ట్‌లకి మీ సుశీలే మహారాణి!' అని బోధించారు.

మెళ్ళో మంగళసూత్రం వేస్తుంటే, ''ఇదెందుకు?'' అంది సుశీల.

''పెళ్ళయింది. భర్త పొరుగూరు వెళ్ళాడు అని చెప్పాలి. పెళ్ళయిన ఆడదానితో సంభోగం అంటే అదో ఆనందం వాళ్ళకి. అయినా ఇప్పుడు ఒళ్ళు వడిలిపోయింది. కాబట్టి నీకిదే సరైన వేషం!''

అనుభవజ్ఞురాలైన తల్లి, వృత్తిలో లౌక్యాన్ని జీర్ణం చేసుకునేలా ప్రయత్నించింది సుశీల.

ఆ తర్వాత వాళ్ళు దండకారణ్యం మధ్యలో వున్న గాలికొండాపురానికి మకాం మార్చారు.

***

ఎండ తీవ్రంగా కాస్తున్నా మధ్యాహ్నం రెండు గంటలకే చలిగాలి తిరిగింది. గుహల దగ్గర తిరిగే సాధువు గోస్తనీ నదిలో స్నానం చేస్తున్నాడు. రాత్రి డ్యూటీకెళ్ళొచ్చిన స్టేషన్ సూపరింటెండెంట్ గారు తన పెంపుడు కుక్కని వూళ్ళో తిప్పుతున్నాడు.

గెస్ట్‌హౌసుల్లో దిగిన యాత్రికులు కెమెరాలతో లోయల్లో తిరుగుతున్నారు. స్టేషన్లో కాంటీన్ నడిపే ఒరియావాడు మేకపాల కోసం ఊళ్ళో కొచ్చాడు. గాలికొండకింద మిలటరీ హోటలు మీసాలరాజు నాటుకోళ్ళ

కొనడానికి గిరిజనుల పాకలవేపు వెళుతున్నాడు.

రాత్రి పొగచూరిపోయిన పెట్రోమాక్స్ లైటుని చిట్టుతో తోముతూ చిన ముత్యంతో మాట్లాడుతున్నాడు భూషణం. ''రాత్రి గెస్ట్‌హౌస్‌లో దిగినతను ఇక్కడ పండే రంగురాళ్ళు కొనడానికి వస్తుంటాడట, లప్పా! బరంపురం లాల్చీ వేసుకుని బలంగా వుంటాడు... తాగితే మాత్రం రాక్షసుడి అవతారం ఎత్తుతాడట. నే నొచ్చినప్పుడల్లా నీకు కబురు చేస్తుంటాను. అస్తమానూ ఇవ్వడం కుదరదు. ఇదిగో!'' అనేసి ఒకేసారి పదివేల కట్ట సుశీల కిచ్చేశాడు.

వాడలా మాట్లాడుకుంటూండగా లోపల వాంతి చేసుకుంటున్న సుశీల కనిపించింది.

నల్ల సుశీల నెల తప్పింది.

అది విన్న చిన్న ముత్యం ఇక ఈ వృత్తి మనకొద్దని నిర్ణయం చేసుకుని కూతుర్ని పువ్వుల్లో పువ్వులా చూసుకోవడం మొదలెట్టింది.

పోయినశక్తీ, కాంతీ తిరిగొచ్చాయి సుశీలలో, ఇంతకు ముందెప్పుడో పారేసుకున్న చలాకీతనం మళ్ళీ ప్రవేశించింది. తల్లి వద్దంటున్నా ఎగిరి గంతులేసింది. రాకపోయినా సారమతిరాగం పాడే ప్రయత్నం చేసింది. ఇప్పుడు పనిలేని భూషణం ఇంటికొస్తుంటే ఆటలు పట్టించేస్తోంది.

ఇలా కాలం గడుస్తుండగానే తొమ్మిది నెలలూ నిండి పోయాయి నల్ల సుశీలకి.

***

ఆ రోజు....

పసుపురంగు పిట్ట ఒకటి టిల్లచెట్ల గుబుర్లలోకి దూరి చిగుళ్ళని మాత్రమే రుచిగా తింటోంది. నేలమీద పడున్న పచ్చితాటాకు మీదకి చేరిన రెండు ఎర్ర తొండలు దెబ్బలాడుకుంటున్నాయి. కొండ దిగువన మేస్తున్న గేదె వీపు మీద వాలిన కాకి నిశ్శబ్దంగానే కూర్చుంది. గాలికి వూగుతున్న సొలపచెట్టు ఆకుమీదకి జేరిన రామచిలక కిందికి జారిపోకుండా కాళ్ళతో పట్టుకుంది. గంతులేస్తూ పరుగెత్తుకున్న చిన్న గొర్రెపిల్లని ఎలాగయినా పట్టుకోవాలని వెనకాలే పరిగెడుతున్నాడు కొండ ముసలాడు.

రోజూ చూస్తున్నదే అదంతా. అయినా ఆ రోజెందుకో చాలా అందంగా కనిపించింది.

అలా చూస్తున్న సుశీల మెడ వెనకేదో లాగినట్టయి తల పైకెత్తేసరికి నల్లటి మబ్బులతో మూసుకుంటున్న ఆకాశం కనిపించింది.

కాస్సేపటికి వీస్తున్న గాలిలో బాగా మార్పొచ్చింది.

ఇంకాస్సేపటికి నిలబడ్డ తను అమాంతంగా ఎగిరిపోయేటంత ఉధృతంగా వీయడం మొదలెట్టింది గాలి.

లోయల్లో పెరిగే పనసచెట్లూ, కుంకుడు చెట్లు వేళ్ళతోపాటు కూలి పోతాయేమో అన్నంత వికృతంగా వూగిపోతున్నాయి. కొండలమీద పండే కమలా ఫలాలు, మామిడిపళ్ళు టపటపా నేల రాలిపోతున్నాయి. గిరిజనుల రెల్లు పాకల కొప్పులు ఎగిరిపోతున్నాయి. వాతావరణం చూస్తుంటే రాత్రి కింకేమవుతుందా అన్నంత భయానకంగా వుంది.

ఆ రోజు, మర్నాడు కూడా అలాగే వుంది వాతావరణం.

పొద్దుట్నుంచీ కాస్త పులపరంగా వున్నట్టు అనిపించింది సుశీలకి. మధ్యాహ్నానికి జ్వరమొచ్చి, సాయంత్రమయ్యేసరికి కాలిపోవడం మొదలెట్టింది ఒళ్ళు. ముట్టుకుచూసిన చినముత్యం రైల్వే డాక్టరు కోసం పరుగెట్టింది. కానీ అతను మోటారు ట్రాలీ మీద చిమిడిపల్లి వెళ్ళాడు


గాలి దుమారానికి ఎగిరొచ్చిన ఆకులు కిటికీ ఊసల్లోంచి దూసుకొచ్చి సుశీల పరుపు మీద పడ్డాయి. జ్వరంతో ఒక పక్క బాధపడుతూనే చిన్న పిల్లలా వాటిని ఏరుకుని ఆడుకుంటూ, ఇక పుట్టబోయే తనబాబుకి స్వాగతం చెబుతోంది.

రాత్రయింది.

తుఫానట!

వాతావరణం చాలా భీభత్సంగా మారింది.

## కథ రాశాక చాలా రోజులు దాచేశాను



నేను తొలి రోజుల్లో రాసిన కథ 'నల్ల సుశీల'. నా తొలి నాటి కథ కావడం వల్ల ఈ కథంటే ఎక్కువ ఇష్టం. ఇందులో ఓ అద్భుతమైన స్త్రీ జీవితాన్ని బాగా చెప్పానని నమ్మకం. ఆ కథ రాశాక చాలాకాలం దాన్ని దాచాను. ఇంట్లో చూస్తే పెద్దవాళ్ళు అరుస్తారనే భయం. దాచిన దానిని అప్పుడప్పుడు బయటకు తీసి చదివి మళ్ళీ దాచేసేవాడిని. చివరికి ఆ కథను జ్యోతికి పంపాను. అందులో వచ్చింది.

-వంశీ

వీస్తున్నగాలికి వర్షం తోడయ్యింది. కరెంటు కూడా పోయింది గాలికొండపురం గ్రామం అంతా ఖాళీచేసేసి వలస వెళ్ళిపోయి నట్టయింది.

అంతలో....

మూసి ఉన్న ఇంటి తలుపు దబదబా బాదుతున్నారెవరో!

వెళ్ళి తీసింది చినముత్యం.

కాకిలా తడిసిపోయి బాటరీలైటు పట్టుకుని నిలబడ్డ భూషణం, వాడికి కాస్త దూరంగా బరంపురం లాల్చీలో బలంగా వున్న మనిషి నోట్లోంచి తాగిన వాసన వేస్తోంది.

వాళ్ళిద్దర్నీ గమనించిన చినముత్యం భూషణం కేసి చూసి ''నీకిదేం దొబ్బిదాయిరా సచ్చినోడ! ఏంటిది?''

''మొన్న గెస్ట్‌హౌస్ కెళితే పదివేలిచ్చారే... ఆ దొరగారు''

''మా సుశీలకి నెలలు నిండినయ్యని చెప్పలేదా?''

''చెప్పడమేంటి ఏడ్చి మొత్తుకున్నాను అప్పా! (ఎత్తయిన కడుపుతో) నెలలు నిండిన ఆడాళ్ళతో శృంగారం గొప్పగా వుంటుందని ఆయనే లాక్కొచ్చేశారు!''

''ఛీ! నోర్మూయ్ వెధవా! జ్వరంతో దాని ఒళ్ళు కాలిపోతుంటే...''

ఆ మాట విన్న ఆ మనిషి విసురుగా దగ్గరకొచ్చి ''ఏంటీ, నెలలు నిండటంతో పాటు జ్వరం కూడా వచ్చిందా?'' అన్నాడు.

''అవును, దొరగారూ! దాని ఒళ్ళు పెనంలాగ కాలిపోతుంది!''

ఆనందంతో పెద్దగా అరిచిన ఆ మనిషి ''నెలలు నిండిన సుశీల ఒళ్ళు కాలిపోతున్న జ్వరంతో వుందా?.... నేను కలకత్తాలో వున్నప్పుడు మా ఫ్రెండ్ హిరెన్ బోస్ చెప్పాడు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న స్త్రీలతో కలిసే అవకాశం వస్తే వదులుకోకు అని... ఇదిగో చూడూ! ఇంతకు ముందు పదివేల గురించి మర్చిపో! ఇదిగో ఇంకో పదివేలు!'' అని అందించి మరుక్షణం సుశీల గదిలోకి దూసుకెళ్ళిపోయి దబ్బున తలుపేసు కున్నాడు.

***

తెల్లవారుతోంది. ఇంకా తగ్గని ఆ తుఫానులోనే బయల్దేరిన శృంగార పురుషుడు తడిసిపోతూ తను దిగిన ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళిపోయాడు.

సుశీలకి నొప్పులు మొదలయ్యాయి. వాటిని భరించలేక మెలికలు తిరిగిపోతోంది. అంత తుపానులోనూ రైలెక్కించి శృంగవరపు కోట తీసుకెళ్ళింది చినముత్యం.

రాత్రికి ఆపరేషను చేసి బిడ్డను బయటకు తీశారు.

స్పృహ వచ్చిన నల్ల సుశీల పక్కలో వున్న బిడ్డను చూసుకుంది.

వాడు... తను కోరుకున్నట్టు మగపిల్లాడే!

తాబేలు పొట్ట, పుల్లలాంటి చేతులు, కాళ్ళు, పెద్ద తలతో చలనం లేకుండా ఉన్నాడు.

*

('ఆంధ్రజ్యోతి' దీపావళి ప్రత్యేక సంచిక *1975*)